క్లుప్తంగా

దీప్తిశ్రీకి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు విభాగ పరిశోధకురాలు వల్లూరి దీప్తిశ్రీకి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. తెలుగు విభాగ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు పర్యవేక్షణలో 'తెలుగు చలన చిత్రాలలో ఆంగ్లభాషా పద ప్రయోగాలు – పరిశీలన(2001-2020)' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించగా దీప్తిశ్రీకి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు.

షాపుల లీజు హక్కు వేలం వాయిదా

అమరావతి: ఈ నెల 20వ తేదీన జరగాల్సిన స్థానిక మెయిన్ రోడ్డులోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం షాపుల లీజు హక్కుల బహిరంగ వేలం వాయిదా పడిందని ఆలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ అనారోగ్యం కారణాలతో ఆస్పత్రిలో చేరటంతో వాయిదా పడినట్లు సిబ్బంది తెలిపారు. మరలా వేలం పాట నిర్వహించే తేదీని దేవదాయ శాఖ అధికారులు త్వరలో ప్రకటిస్తారని తెలిపారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

రాజుపాలెం: మండలంలోని రాజుపాలెం, పెద నెమలిపురి రైతు సేవా కేంద్రాల్లో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏవో వెంకటనర్సయ్య గురువారం తెలిపారు. ఈ రెండు కేంద్రాలలో ఇప్పటి వరకు 10 క్వింటాళ్ల జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పాస్‌పుస్తకాలతో రైతు సేవా కేంద్రాలలో సంప్రదిస్తే విత్తనాలు ఇస్తామని తెలిపారు.

యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి



సత్తెనపల్లి: యువత సరైన వయస్సులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని, లక్ష్యం నెరవేరే వరకు ఓర్పు, పట్టుదలతో నిరంతర కృషి అవసరమని వైజాగ్ డేవిడ్ లవ్ అండ్ హోప్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత జి.విజయ్‌డేవిడ్ అన్నారు. పట్టణంలోని మాస్ట్రిన్‌పేటలో జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి అధ్యక్షతన ఆ ప్రాంతంలో ఉన్న యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యువతకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బక్క సుబ్బారావు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, నాయకులు ఎం.జైపాల్, నందిగం శ్యామ్, నందిగం చిన్న బాబు, వలేటి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సురేష్ మృతదేహానికి పోస్టుమార్టం



రొంపిచర్ల: మండలంలోని అలవాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన దాసరి సురేష్ మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇటీవల జిల్లా ఎస్పీకి సురేష్ బంధువులు ఫిర్యాదు చేయటంతో ఆయన ఆదేశాల మేరకు రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమాధిలో ఉన్న సురేష్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక వైద్యులు డాక్టర్ హుస్సేన్, రూరల్ సీఐ రామకృష్ణ, తహసీల్దార్ బి.నిర్మల, ఎస్ఐ మణికృష్ణ, ఆర్ఐ కోటేశ్వరరావు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పిడుగురాళ్ల: జూలై 9వ తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెకు కార్మికులు మద్దతు ఇవ్వాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ డి.శివకుమారి పిలుపునిచ్చారు. పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో కంప సాగర్ బాబు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డి.శివకుమారి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో కార్పొరేటర్లకు దోచి పెట్టి కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు వేతన కోడ్స్‌గా చేశారని ఆమె విమర్శించారు. అదే విధంగా తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పిస్తామని, మెరుగైన వేతనాలు అమలు చేస్తామ ని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి, నేడు ఉన్న ఉద్యోగాలకే ఎసరు పెడుతోందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, చట్టాలను అమలు చేయాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, దేవుళ్ళ కొండలు, మల్లేశ్వరి, రమణ, సీమోను, బత్తుల కొండలు పాల్గొన్నారు.

తగ్గుతున్న పశు పోషణ.. ఇష్టపడని యువత

- గ్రామాల్లో సైతం దొరకని గేదె పాలు
- పెరుగుతున్న పాల ప్యాకెట్ల వినియోగం
- పెరిగిన పోషణ ఖర్చులు, గిట్టుబాటు కాని పాల ధరలు
- గణనీయంగా తగ్గిపోతున్న పాడి పశువులు
- 5 ఏళ్లలో 15 శాతం తగ్గిన పశు సంపద



సంతలో క్రయవిక్రయాలకు వచ్చిన పాడి గేదెలు

క్రోసూరు: రానున్న రోజుల్లో పాలు ఎక్కడి నుంచి వస్తాయో తెలియకుండా పోయే పరిస్థితి ఉంది. గ్రామాల్లో సైతం పాడిపశువుల పోషణ బాగా తగ్గిపోయింది. ప్రతి ఇంటికి పాల అవసరాలున్నప్పటికీ పాల ప్యాకెట్లు తెచ్చుకోవటమే గతి అవుతుంది. పాడి గేదెల నుంచి (కల్తీ, కెమికల్స్ లేని) పాలు తెచ్చుకునే రోజులు పూర్తిగా కనుమరుగయ్యాయని చెప్పవచ్చు.

గతంలో... సుమారు 20 సంవత్సరాల క్రితం గ్రామాల్లో దాదాపుగా ప్రతి రెండు ఇళ్లల్లో ఒక ఇంట్లో తప్పనిసరిగా వారి అవసరాలకు అనుగుణంగా గేదెలు, దున్నలు, ఆవులు, ఎద్దుల పోషకాలు ఉండేవి. వాటి ద్వారా పాల విక్రయం, వ్యవసాయ పనులకు వినియోగించుకుని ఆదాయం సమకూర్చుకుని ఇంటి అవసరాలు తీర్చుకునేవారు.

ఇష్టపడని యువత

పాడి పశువుల పోషణ ఖర్చు విపరీతంగా పెరిగిపోవటంతో పాడి పోషకులు, రైతులు పశువుల పోషణ చేయలేక వదిలేస్తున్నారు. అంతేకాక ప్రతి ఇంట్లో చదువుకున్న యువత పెరగడంతో వారు ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా పశువుల పెంపకానికి ఇష్టపడటం లేదు. ఉన్నత చదువులు చదువుకుని నగరాల్లో, విదేశాల్లో నివసించే వారు అధికమవుతుండడంతో వారి ఇళ్ల వద్ద పశువుల పోషణ తల్లిదండ్రులు, అవ్వాతాతలు చూసుకోవాల్సి వస్తుంది. దీంతో పశువుల పోషణ పూర్తిగా కనుమరుగవుతుందని చెప్పవచ్చు.

గిట్టుబాటు కావడం లేదు

జాతి గేదెలు తెచ్చుకుని డెయిరీ ఫాం పెట్టుకుని పూర్తి జాగ్రత్తలు తీసుకుని పోషించటం కూడా భారంగా మారిందని రైతులు చెబుతున్నారు. వాటి మేత, వాటికి డాక్టర్ల పర్యవేక్షణ, వ్యాక్సిన్‌లు.. ఇలా ఎంతో జాగ్రత్తలు పాటించి వాటి మీద వచ్చే పాలు పాల కేంద్రాలకు తరలిస్తే అక్కడ వారికి గిట్టుబాటు కావటం లేదని పాడి పోషకులు అంటున్నారు.

5 ఏళ్లలో 15 శాతం తగ్గుదల

మండలంలో పశు సంపద 2019 లెక్కల ప్రకారం ఆవులు 2,516, గేదెలు 12,500, గొర్రెలు 15,700, మేకలు 4,100, పౌల్ట్రీ 10,828 ఉండగా 2024 లెక్కల ప్రకారం 15 శాతం తగ్గినట్లు మండల పశు వైద్యులు డాక్టర్ మల్లయ్య తెలిపారు. అంటే మొత్తం 45,644 పశు సంపద ఉండగా ఐదేళ్లలో 15 శాతం మేర గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం 38,797 పశు సంపద మాత్రమే ఉంది. వచ్చే 20 సంవత్సరాలకు ఉన్న దాంట్లో 60 శాతం పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

ఏనాడో మరిచిపోయారు

గతంలో గ్రామాల్లో ఉన్న ప్రజలకు కావాల్సిన పాలు ఇళ్ల వద్ద పశు పోషకుల వద్ద దొరికేవి. అటువంటిది పాడిపోషణ పూర్తిగా తగ్గిపోవటంతో పాల కొరత ఏర్పడింది. గేదె పాలు దొరకక పాల ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్నారు. పాలప్యాకెట్లలో నాణ్యత ఉండకపోగా లీటర్ రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. దీంతోపాటు సహజంగా ఇంటి వద్ద పాలతో తయారు చేసుకునే నేతీ ఘుమఘుమలు ప్రజలు ఏనాడో మరిచిపోయారు. పాలబూత్‌ల వద్ద విక్రయించే నాణ్యతలేని నెయ్యి ప్యాకెట్లు కొనుగోలు చేసుకొని మమ అనిపిస్తున్నారు. పిల్లలకు నెయ్యితో ఆహారం తినిపించాలన్నా అసలు నెయ్యి కరువైందని ప్రజలు చెబుతున్నారు.

ఎవరూ చేయటం లేదు



ప్రజలు పాడి పశువుల పోషణను చాలించుకుంటున్నారు. పశువుల పోషణ చేసేందుకు అధిక శాతం మంది ఇష్టపడటం లేదు. అలాగే ఎవరూ చేయడం లేదు. దీంతో పశువుల పోషణ తగ్గిపోయింది. గతంలో పాడి ఉన్న వారు కూడా పాడి వదిలేసి పాలు కొనుక్కొంటున్నారు.

– రొంపిచర్ల ప్రసాద్, క్రోసూరు, రైతు సంఘం నాయకులు

అధికారులు నిర్లక్ష్యం వీడాలి


- సర్వసభ్య సమావేశానికి కూడా రాకపోతే ఎలా
- తీరు మారకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా
- మీరే ఇలా ఉంటే ప్రజా సమస్యలు తీర్చేది ఎలా
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మీరయ్య ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య

పెదకూరపాడు : మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా ఆయా శాఖల అధికారులు పాల్గొనకపోవడం బాధాకరమని, నిర్లక్ష్యం వీడాలని, అధికారుల తీరు ఇలా ఉంటే ప్రజా సమస్యలను ఎలా పరిష్కరిస్తారని, తీరు మారకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి దాదాపు సగం పైగా శాఖల అధికారులు గైర్హాజరవ్వడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. మీ తీరు ఇలా ఉంటే ప్రజా సమస్యలను ఎలా పరిష్కరించగలరని గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని, మూడు నెలలకు ఒకసారి హాజరు కాలేకపోతే ఎలా అని అన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. తీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో సర్వసభ్య సమావేశంలో ఏమీ తీర్మానించకుండానే సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు తహసీల్దార్ ధనలక్ష్మి, సూపరింటెండెంట్ సోమయాజులు పాల్గొన్నారు.

యోగా సాధనతో జీవన ప్రమాణం మెరుగు



యోగాసనాలు వేస్తున్న పులహరి బానోజీ

సత్తెనపల్లి: జీవన విధానంలో నిత్యం యోగా అలవాటు చేసుకుంటే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని యోగా సాధకుడు, మాజీ కౌన్సిలర్ పులహరి బానోజీ అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగా పోటీలు చేపట్టగా పట్టణ, మండల స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ నెల 21న జరిగే బహుమతి ప్రదానంలో బహుమతి అందుకోనున్నాడు. ఈ సందర్భంగా గురువారం బానోజీ మాట్లాడుతూ గుంటూరు గీతా మందిరంలో వాసవి మహిళా యువ క్లబ్, యోగా ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో వరుసగా మూడు సంవత్సరాలు విజేతగా నిలిచానన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, యోగాను మించిన వైద్యం లేదన్నారు. నిత్య జీవితంలో యోగా భాగం కావాలన్నారు. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని, మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతుందన్నారు. యోగాసనాలతో చేతులు, కాళ్లలో రక్తప్రసరణ మెరుగుపడుతుందన్నారు.

విధులకు గైర్హాజరైన వైద్యులపై చర్యలు తీసుకోవాలి

ఎంపీపీ మేకల హనుమంతరావు



రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ మేకల హనుమంతరావు తదితరులు

అమరావతి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధి నిర్వహణకు గైర్హాజరైన వైద్యాధికారులపై ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని ఎంపీపీ మేకల హనుమంతరావు తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటల సమయంలో ప్రజాప్రతినిధిగా ప్రజలకు అందుతున్న వైద్య సేవల పరిశీలనకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్‌లో వైద్యాధికారులు రవికుమార్, జి.సరస్వతి, కె.దీప్తి విధులకు హాజరు కాలేదన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభించాల్సిన ఓపీని 10 దాటినా ప్రారంభం చేయలేదని దీనిపై పలు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. హాస్పిటల్లో పరిశుభ్రత నిర్వహణ సరిగ్గా లేకపోవడం, మెనూ ప్రకారం పేషెంట్లకు ఆహారం అందించడం లేదని, గత రెండు నెలలుగా రోగులకు అల్పాహారం అందించటం లేదన్న వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో సిబ్బందికి సంబంధించిన బోర్డు ఏర్పాటు చేయలేదని, కొంతమంది సిబ్బంది ప్రైవేటు ల్యాబ్‌లతో ఒప్పందం కుదుర్చుకుని రోగులకు అనవసరమైన టెస్టులు చేయించి సొమ్ము చేసుకుంటున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. పేద రోగులకు అసౌకర్యం కలిగించిన వారిపై వెంటనే వైద్య శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ హనుమంతరావు వార్డులలో తిరిగి అందుతున్న సౌకర్యాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు.

మాదిగల మహామేళా విజయవంతం చేయాలి



ముప్పాళ్ళ: జూలై 7వ తేదీన జరిగే మాదిగల మహామేళా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా కో కన్వీనర్ గుండాల నగేష్‌మాదిగ కోరారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల మహామేళా కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న నగేష్‌మాదిగ మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా అధికార ప్రతినిధిగా కందుల జార్జిమాదిగ, సత్తెనపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కంభంపాటి రమేష్‌మాదిగ ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బుమాదిగ, సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చింతపల్లి గంగాధర్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు తిరిగి చేతికివచ్చాయి

బాధితులకు అప్పగించిన చిలకలూరిపేట అర్బన్ పోలీసులు



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న అర్బన్ సీఐ రమేష్

చిలకలూరిపేటటౌన్: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 11 సెల్ ఫోన్‌లను పోలీసులు విజయవంతంగా రికవరీ చేశారు. గురువారం చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్ స్టేషన్‌లోని తన కార్యాలయంలో ఆయా సెల్ ఫోన్‌లను పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అప్పగించారు. తమ సెల్ ఫోన్‌లను తిరిగి పొందడంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు. పోలీసులు తమ ఫిర్యాదుపై త్వరితగతిన స్పందించి, పోగొట్టుకున్న వస్తువులను తిరిగి తెచ్చి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

పౌరాణిక కళాకారుడు లక్ష్మారెడ్డి మృతి



పెదకూరపాడు: మండల పరిధిలోని అబ్బురాజుపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ పౌరాణిక నాటక రంగ కళాకారుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి నాయకుడు చిర్రా లక్ష్మారెడ్డి (80) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. లక్ష్మారెడ్డి మృతదేహాన్ని పల్నాడు జిల్లా ప్రజా నాట్య మండలి కార్యదర్శి భైరపట్నం రామకృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్ష్మారెడ్డి సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ, రామాంజనేయ యుద్ధం వంటి అనేక పౌరాణిక నాటకాలలో ప్రముఖ పాత్రలు ధరించారని అన్నారు. ప్రజా నాట్య మండలి కార్యక్రమాలలో పాల్గొనే వారని వారు గుర్తు చేసుకున్నారు. లక్ష్మారెడ్డి మృతి ప్రజానాట్య మండలికి తీరని లోటని అన్నారు. పలువురు ప్రముఖులు లక్ష్మారెడ్డికి నివాళులర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు ఒక మొక్క నాటుదాం

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటుతున్న హెల్ప్ ఫౌండేషన్ నిర్వాహకులు

పెదకూరపాడు: లగడపాడు గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో మాతృభూమి పరిరక్షణకై ఒక మొక్క నాటుదాం కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణం మన జీవనాధారం, దాని సంరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. ప్రకృతిని కాపాడుకునేందుకు చెట్లను నాటడం, నీటిని పొదుపుగా వాడుకోవడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం వంటి చిన్న చిన్న పనుల ద్వారా పర్యావరణ సంరక్షణలో గొప్ప మార్పునకు నాంది పలక వచ్చన్నారు. వాతావరణ మార్పులు, భూ తాపం, జలవనరుల కొరత వంటి సమస్యలు ఇప్పటికే ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయని, ఇలాంటి సమస్యలు నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషి వెలకట్టలేనిదని స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యం ద్వారా ప్రగతిని సాధించవచ్చని తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైస్ కార్డుల ఈ కేవైసీ 30లోగా పూర్తి చేయాలి

తహసీల్దార్ కె.పుల్లారావు



మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారావు

నకరికల్లు: ఈ నెల 30వ తేదీలోగా రైస్ కార్డుల ఈ కేవైసీ పూర్తి చేయాలని తహసీల్దార్ కె.పుల్లారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 సంవత్సరాల వయస్సు పైబడిన కార్డుదారులకు ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీలోగా ఇళ్లకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. తూకంలో తేడాలు లేకుండా వ్యవహరించాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, రేషన్‌షాపు ఎదుట డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, వీఆర్వోలు, సిబ్బంది, రేషన్ డీలర్‌లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



సైకిల్ యాత్ర చేస్తున్న కె. ముత్తు సెల్వన్

పిడుగురాళ్ల: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, తనవంతుగా అవగాహన పెంచడానికి ప్రపంచ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు కె.ముత్తు సెల్వన్ అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి పిడుగురాళ్లకు చేరుకున్నారు. ఇక్కడే బస చేసి తిరిగి బుధవారం ఉదయాన్నే యాత్రను మొదలు పెట్టారు. అంతకుముందు పట్టణ సీఐ శ్రీరామ్ వెంకట్రావు, తహసీల్దార్ మధు బాబులను కలిసి అనుమతులను తీసుకున్నారు. కోయంబత్తూరుకు చెందిన కె. ముత్తు సెల్వన్ 2021లో ఈ సైకిల్ యాత్ర చేపట్టానని తెలిపారు. మొత్తం 8 దేశాలు 5 సంవత్సరాలలో ప్రయాణం చేసి గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే మూడు దేశాలు (బంగ్లాదేశ్, నేపాల్, భారతదేశం)లో యాత్ర నిర్వహించానన్నారు. ఆంధ్రలోకి అడుగుపెట్టి 60 రోజులు అయినదని చెప్పారు. ఈ సందర్భంగా ముత్తు సెల్వన్‌కు కొందరు నాయకులు రూ.8,500 అందజేశారు. అనంతరం ముత్తు సెల్వన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి తిరిగి తన పర్యటనను మొదలుపెట్టారు.

నిప్స్ అధ్యాపకుడికి డాక్టరేట్

నరసరావుపేట రూరల్: నిప్స్ కళాశాల అధ్యాపకుడు యం.రామకృష్ణుడు రాజస్థాన్ కెరీర్ పాయింట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేఎన్ సురేష్ కుమార్ గురువారం తెలిపారు. ఫార్మస్యూటికల్ అనాలసిస్ విభాగంలో డెవలప్‌మెంట్ అండ్ వ్యాలిడేషన్ ఆఫ్ స్పెక్ట్రోఫోటో అండ్ ఆర్‌పీ హెచ్‌పీఎస్‌సీ మెథడ్స్ ఫర్ ది డిటర్మినేషన్ ఆఫ్ బల్క్ డ్రగ్స్ అండ్ ఫార్మస్యూటికల్ డోసేజ్ ఫామ్స్ అనే అంశంపై ఇంప్యూరిటీ ప్రొఫైల్ డ్రగ్ అనాలసిస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు వివరించారు. ప్రస్తుత కాలంలో ఇంప్యూరిటీస్‌ని ఎనలైజ్ చేసి ప్యూర్ ప్రొడక్ట్స్‌ను అందించడం అనేది అత్యవసరమని తెలిపారు.

ఆలయ భూముల్లో అనధికారికంగా సాగు చేయొద్దు

ఈఓ గాదె రామిరెడ్డి



సర్వేయర్‌తో ఆలయ భూముల కొలతలు తీయిస్తున్న ఈఓ గాదె రామిరెడ్డి

రెంటచింతల: దేవదాయ శాఖ అనుమతి లేకుండా మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న పలు ఆలయ, పూజారి భూములను సాగు చేయవద్దని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి అన్నారు. గురువారం ఆయన పలు గ్రామాలలోని ఆలయ, పూజారి భూములను సందర్శించారు. ఆ భూములను సాగు చేస్తున్న రైతులందరూ దేవ దాయ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. అనంతరం రెంటచింతలలో వేంచేసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ మాన్యం భూమి సర్వే నంబర్ 726 లో 1.50 ఎకరాలు, సర్వే నంబర్ 740 'ఏ', 'బీ'లో ఉన్న 15.88 ఎకరాల భూములను సర్వేయర్ అర్జున్‌తో కొలిపించారు. బాట, వాగు పొరుదల వివరాలను నమోదు చేసినట్లు ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆదర్శంగా నిలవాలి



మున్సిపల్ కమిషనర్ సన్మానిస్తున్న మహిళలు

పిడుగురాళ్ల: మహిళలు స్వశక్తితో ఎదిగి సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని మున్సిపల్ కమిషనర్ ఇరువురు శ్రీనివాసులు అన్నారు. కొట్టడంలోని కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం మహిళల కోసం ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకొని, కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని సూచించారు.

మూడు నెలలు శిక్షణ ఇచ్చిన తర్వాత వారికి ఉచితంగా కుట్టు మిషన్ కూడా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. మిషన్ నేర్చుకునే ప్రతి ఒక్కరి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నెలలో నాలుగు సార్లు విజిట్ చేస్తానని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అనంతరం నూతనంగా విచ్చేసిన కమిషనర్ శ్రీనివాసులును మహిళలు శాలువాతో సత్కరించారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

మాచర్ల : పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అడిగొప్పల చెన్నకేశవ చారి, ఆలయ కమిటీ అధ్యక్షులు బండ్ల వెంకటేశ్వర్లు, బోయ రామిరెడ్డి, రాధ, రమణారెడ్డి, నర్సయ్యలతోపాటు, పలువురు సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వినుకొండ: యోగావల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మున్సిపల్ కౌన్సిలర్ షకీలా దస్తగిరి అన్నారు. అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా మేనెల 21 నుంచి జూన్21 వరకు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు యోగాపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని గీతాంజలి పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు ఇస్మాయిల్, పాఠశాల కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్ లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ సూరజ్



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ సూరజ్

రొంపిచర్ల: రెవెన్యూ, పీజీఆర్ఎస్ కు వచ్చిన ఫిర్యాదులు, సమస్య లను వెంటనే పరిష్కరించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయంలోకి వచ్చిన పీజీఆర్ఎస్ ఫిర్యాదు లపై అధికారులతో చర్చించారు. అనంతరం ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.నిర్మల, ఆర్.ఐ కోటేశ్వరరావు, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.